క్లుప్తంగా

ముగిసిన బాల సంస్కార్ శిబిరం



పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

బోట్‌క్లబ్: స్థానిక ఓలేటివారివీధిలో ఉన్న విశ్వహిందూపరిషత్ కార్యాలయంలో నెల రోజులుగా సాగుతున్న బాలసంస్కార్ శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. బాలలకు భగవద్గీత 11వ అధ్యాయంలో 55 శ్లోకాలు, నీతి కథలు, వ్యక్తిత్వ వికాసం, సంస్కృతి సంప్రదాయాలపై శిక్షణ ఇచ్చారు. విశ్వహిందూపరిషత్ సంస్కృత ప్రచార విభాగం కన్వీనర్ గరిమెళ్ల అన్నపూర్ణయ్య శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో నిర్వహించారు. ముగింపు సందర్భంగా నిర్వహించిన పోటీల్లో దువ్వూరి గంగాధర్ అభిరామ్ శాస్త్రి ప్రథమ, నిర్వాని వైష్ణవి ద్వితీయ, దువ్వూరి కృతిక్ తృతీయ, శార్వాణి, ప్రణవి, సింధూరి ప్రోత్సాహక బహుమతులు సాధించారు. కార్యక్రమంలో సహ కార్యదర్శి ఉదయభానోజీ రావు, విశ్వహిందూ పరిషత్ కాకినాడ జిల్లా అధ్యక్షులు ఆర్.రవిశంకర్ పటా్నయక్, సహాయ కార్యదర్శి రవివర్మ, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సైకిల్ వితరణ



విద్యార్థినికి సైకిల్ అందజేస్తున్న క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు

కరప: మండలం వేళంగిలోని మెర్లాస్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని గంధం ఝాన్సీ సత్యశ్రీకి రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గోపు కాశీ విశ్వనాథ్, అరిగెల బాబి సైకిల్ అందజేశారు. శాకా శ్రీనివాస్, కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు బాలిక పరిస్థితిని వివరించడంతో క్లబ్ ప్రతినిధులు బాదం జయరామ్‌గోపాల్ ద్వారా సైకిల్ కొనిపించి శుక్రవారం ఆమెకు అందజేశారు.

వంటలు రుచికరంగా చేయాలి



కరప హైస్కూలులో సీసీహెచ్‌లకు మెనూపై శిక్షణ ఇస్తున్న రిసోర్స్‌పర్సన్లు

కరప: ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేస్తున్న మధ్యాహ్న భోజనపథకంలో ప్రతిరోజూ నిర్దేశించిన మెనూ ప్రకారం వంటలు రుచికరంగా చేయాలని ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు కాకినాడ అర్బన్ నుంచి రెండు పాఠశాలల, రూరల్ మండలం నుంచి ఒక పాఠశాల నుంచి వచ్చిన కుక్ కమ్ హెల్పర్లకు (సీసీహెచ్) ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. విద్యార్థులు ఇష్టంగా తినగలిగేలా వంటకాలు ఉండాలన్నారు. పాఠశాల విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకం అమలుకు రోజువారీ మెనూ ఇవ్వడం జరిగిందని, ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా మెనూ ప్రకారం వంటలు చేయాలన్నారు. పెద్దాపురప్పాడు హైస్కూలు సీసీహెచ్‌లు జి.గంగాభవాని, సీహెచ్ దుర్గాభవాని తిరుపతి తాజ్‌హోటల్‌లో మెనూ వంటకాలపై శిక్షణ పొందారని, వారు చెప్పినట్టుగా మెనూలో మెళకువలపై అవగాహన చేసుకుని, పాఠశాలల్లో వంటలు సక్రమంగా చేయాలని ఎంఈఓలు సూచించారు. శిక్షణ అనంతరం సీసీహెచ్‌లను రోజువారీ మెనూ ప్రకారం టీములుగా విభజించి వారితో వంటల పోటీలు నిర్వహించారు. కరప హెచ్‌ఎం కె.స్వర్ణరాణి, కాకినాడ అర్బన్, రూరల్ మండల విద్యాశాఖాధికారులు కె.వెంకటేశ్వరరావు, సీహెచ్ రవి, ఎస్.ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

నేడు హనుమజ్జయంతి వేడుకలు



సామర్లకోటలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం

సామర్లకోట: స్థానిక మారుతినగర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతిని నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను పూర్తి చేశారు. శనివారం తెల్లవారుజామున స్వామి వారికి ప్రత్యేక పూజలు, అనంతరం భక్తులచే సామూహిక వ్రతాలు, సాయంత్రం హోమం, రాత్రి స్వామి వారికి పుష్పాలు, తమలపాకులచే అభిషేకాలు నిర్వహిస్తారు. ఆలయ ధర్మకర్త చింతామణి పంతంజలి శాస్త్రి ఆధ్వర్యంలో పూజలు జరుగుతాయి. అదే విధంగా నియోజకవర్గ పరిధిలోని అన్ని ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామి వారి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఆయా ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

డేంజర్ వీల్స్

- కేజ్ వీల్ ట్రాక్టర్లతో అప్రమత్తం
- నైపుణ్యం, అవగాహన లోపంతో ప్రమాదాలు
- ప్రాణాలతో చెలగాటం వద్దంటున్న నిపుణులు

కాకినాడ సిటీ: ప్రస్తుత కాలంలో వ్యవసాయంలో యంత్రాల వినియోగం ఎక్కువైంది. పొలం దున్నేందుకు, జంబు కొట్టేందుకు కేజ్ వీల్ ట్రాక్టర్‌ను వినియోగిస్తున్నారు. వీటితో ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయి. డ్రైవర్లు వీటి కింద పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్న సంఘటనలు అనేకం. ప్రస్తుతం ఖరీఫ్ సాగు ప్రారంభమైంది. వర్షాలు కూడా కురవడంతో అక్కడక్కడ నారుమళ్లు వేసే పనులను రైతులు చేపట్టారు. ఈ తరుణంలో డ్రైవర్లు వీటిని నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రమాదాలకు కారణాలివే

- పొలాలన్నీ ఒకే విధంగా ఉండవు. నీటితో నింపిన తర్వాత డ్రైవర్‌కు భూమి తీరుపై అవగాహన లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ.
- నారు ఎక్కువగా ఉన్న స్థలంలో ఎక్కువ లోతుకు కేజీవీల్ వెళ్లడం. అక్కడ భూమి వదులుగా మారడం జరుగుతుంది. భూమి గట్టిగా ఉన్న ప్రదేశంలో డ్రైవర్లు యాక్సిలేటర్‌ను పెంచుతుంటారు. బరువంతా ఈ కేజ్ వీల్స్‌పై పడుతుంది. ముందు టైర్లు అంతగా బరువు లేకపోవడంతో ట్రాక్టర్ ఒక్కసారిగా బోల్తా కొడుతుంది.
- పొలం మూలల్లో ఎక్కువ సార్లు కేజీ వీల్స్ నడుస్తాయి. అక్కడ లోతుగా తయారవుతుంది. వేగంగా వెళ్లే క్రమంలో దిగబడి బోర్లా పడుతుంది.
- డ్రైవర్లకు పూర్తి స్థాయి నైపుణ్యం లేకపోవడం, ఓవర్ స్పీడ్‌తో పొలాల్లో దున్నడంతో ప్రమాదాలు జరుగుతాయి. పొలంలో లోతు పెరిగినా కొద్ది ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు హెచ్చరిస్తున్నారు.



కేజ్ వీల్స్‌తో పొలం దమ్ము చేస్తున్న రైతు

- కేజ్ వీల్స్ 20-25 సెంటీమీటర్ల కన్నా ఎక్కువ లోతుకు వెళ్తే ఇబ్బందులు ఎక్కువగా ఉంటాయి.

ముందుస్తు జాగ్రత్తలు

- కేజ్ వీల్స్ బిగించేటప్పుడు తప్పనిసరిగా వెనక టైర్లు సమాన స్థాయిలో ట్రాక్టర్ బంపర్ ముందు వెయిట్ బిళ్లలు వేసుకోవాలి.
- బరువు ఎక్కువైతే మైలేజ్ తక్కువగా వస్తుందనే ఉద్దేశంతో వాడటం లేదు. అది సరైన విధానం కాదు.
- ట్రాక్టర్‌ను పొలంలోకి దించే ముందు పూర్తి స్థాయిలో కండిషనర్‌గా ఉంచుకోవాలి.
- పొలం దున్నుతున్న సమయంలో ట్రాక్టర్‌ను ఎప్పుడు ఒకే వేగంతో నడపాలి.
- యజమానుల మెప్పు కోసం వేగం పెంచొద్దు.
- మూల మలుపు దగ్గర వేగం తగ్గించాలి.
- ఈ చక్రాలతో దున్నేప్పుడు ట్రాక్టర్‌కు కల్టివేటర్ అమర్చుకోవాలి. దీంతో బోల్తాపడే అవకాశాలు తక్కువగా ఉంటాయి.

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన



కౌంటింగ్ సెంటర్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్వో వెంకటరావు

కాకినాడ సిటీ: కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు శుక్రవారం స్ట్రాంగ్ రూములను సందర్శించారు. రోజువారీ తనిఖీల్లో భాగంగా స్థానిక జేఎన్టీయూకే ఆవరణలోని స్ట్రాంగ్ రూమ్ భద్రతను ఆయన పర్యవేక్షించి అక్కడి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం కౌంటింగ్ సెంటర్‌ను కూడా సందర్శించారు. అక్కడ చేపట్టాల్సిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆర్వో వెంకటరావు మాట్లాడుతూ స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు. నిరంతరం సీసీ కెమెరాలు నిఘా ఉంటుందన్నారు. భద్రతను నిరంతరం పర్యవేక్షించేందుకు ఇద్దరు గెజిటెడ్ అధికారులను కూడా నియమించామన్నారు. ఆయన వెంట పలువురు ఎన్నికల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఊరూ వాడా.. కౌంటింగ్ కబుర్లే

- ఓట్ల లెక్కింపునకు ముమ్మర ఏర్పాట్లు
- అందరిలోనూ తీవ్ర ఉత్కంఠ
- ఏ సెంటర్‌లో చూసినా ఫలితాలపైనే చర్చ



కాకినాడ సిటీ: గతంలో ఎన్నడూ లేని విధంగా సార్వత్రిక ఎన్నికల్లో చివరి ఘట్టమైన ఓట్ల లెక్కింపు ఎప్పుడెప్పుడా అని అటు ప్రజలు, ఇటు రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల ఫలితాలు వైఎస్సార్ సీపీ వైపే ఏకపక్షంగా ఉంటాయని, అనేక మంది చర్చించుకుంటుండగా పోటాపోటీగా ఉండొచ్చని పలువురు వాదిస్తున్నారు. అయితే పలుచోట్ల చర్చల్లో సంక్షేమ పథకాలతో మహిళలు అధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నారని, ఆ పథకాలే వైఎస్సార్ సీపీని ముందుకు నడిపించి మరోసారి అధికారం వచ్చేలా చేయనున్నాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. కాగా ఏ అభ్యర్థికి ఎంత మెజారిటీ వస్తుందనే లెక్కలను ఆయా పార్టీల నేతలు ముందుగానే అంచనాలు వేసుకుంటున్నారు. జూన్ 4 మంగళవారం జరిగే కౌంటింగ్ ప్రక్రియ కోసం అటు జిల్లా అధికారులు, ఇటు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 2019లో ఎన్నికల పోలింగ్, ఫలితాల మధ్య 41 రోజుల పాటు ఎదురు చూడాల్సి వచ్చింది. ఈ ఏడాది పోలింగ్ జరిగిన 21 రోజులకే కౌంటింగ్ నిర్వహించనున్నా ప్రజల్లో ఉత్కంఠ గతం కంటే అధికంగా ఉందని పలువురు విశ్లేషిస్తున్నారు. కౌంటింగ్‌కు మరో మూడు రోజుల మాత్రమే గడువు ఉంది. వచ్చే మంగళవారం ఉదయం 8 గంటలకు కాకినాడలోని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు జరగనుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు ప్రారంభిస్తారు. కాగా ఒక్కో రౌండ్‌కు 30 నిమిషాల పాటు సమయం పడుతుందని, మధ్యాహ్నం 4 గంటలకు పూర్తి ఫలితం వెలువడుతుందని అధికారులు చెబుతున్నారు.

కౌంటింగ్ ఇలా..

కాకినాడ పట్టణ, కాకినాడ రూరల్ నియోజకవర్గాలకు సంబంధించి కాకినాడ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో, కాకినాడ రూరల్ సెగ్మెంట్ కౌంటింగ్ మెకానికల్ ఇంజినీరింగ్ బ్లాక్‌లోను, కాకినాడ పట్టణానికి సివిల్ ఇంజినీరింగ్ బ్లాక్‌లోను ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాకినాడ సిటీ నియోజకవర్గంలో 234 పోలింగ్ కేంద్రాల్లో 2,41,620 మంది ఓటర్లు ఉండగా 1,74,366 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే కాకినాడ రూరల్ నియోజకవర్గంలో 264 పోలింగ్ కేంద్రాల్లో 2,69,330 మంది ఓటర్లు ఉండగా 2,01,833 మంది ఓటర్లు ఓట్లు వేశారు. కాకినాడ సిటీ నియోజకవర్గంలోని 234 పోలింగ్ బూత్‌లకు సంబంధించి 14 టేబుళ్లను ఏర్పాటు చేయగా 17 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తయ్యేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని 264 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 14 టేబుళ్లను ఏర్పాటు చేయగా 19 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తయ్యేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా ఇప్పటికే కౌంటింగ్ ఏజెంట్లను నియమించుకోవాలని అభ్యర్థులకు సమాచారం ఇవ్వడం, ఆయా పార్టీల నాయకులు ఏజెంట్లకు సంబంధిత జాబితాలను అధికారులకు అందజేసే పనిలో ఉన్నారు.

కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్ ఉద్యోగ విరమణ

కాకినాడ సిటీ: సుదీర్ఘ సేవలందించి ఉద్యోగ విరమణ చేయడం ఒక వరమని డీఆర్వో డి.తిప్పేనాయక్ అన్నారు. సుమారు 37 ఏళ్ల పాటు రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో పని చేసి పదవీ విరమణ చేస్తున్న జిల్లా కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి పొన్నమండ శ్రీనివాసరావు అభినందన, సత్కార కార్యక్రమాన్ని కలెక్టరేట్ వివేకానంద హాలులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఉద్యోగి ప్రజలకు సేవ చేయడమే ఒక బాధ్యతగా ఉండాలన్నారు. పొన్నమండ శ్రీనివాసరావును డీఆర్వో తిప్పేనాయక్, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు పితాని త్రినాథరావు, కార్యాలయం సిబ్బంది దుర్గాప్రసాద్, సుధారాణి, యమున, శివ తదితర ఉద్యోగులు సత్కరించారు. పొన్నమండ మాట్లాడుతూ తాను 1987లో అడ్డతీగలలో టైపిస్టుగా ఉద్యోగం ప్రారంభించానని, అంచెలంచెలుగా పదోన్నతి పొందుతూ తహసీల్దార్ స్థాయికి రావడం ఆనందంగా ఉందన్నారు. శేష జీవితాన్ని కుటుంబంతో గడుపుతూ తనకున్న పొలంలో వ్యవసాయం చేసుకుంటానని తెలిపారు. తనను సత్కరించిన అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



పొన్నమండను సత్కరిస్తున్న డీఆర్వో తిప్పేనాయక్, తదితరులు

విశ్రాంత జీవితం ఆనందమయం కావాలి



డాక్టర్ విజయకుమార్‌ను సత్కరిస్తున్న డాక్టర్ లావణ్యకుమారి, మూర్తిబాబు తదితరులు



సత్యనారాయణను ఏఈఓలు, వీఏఏలతో కలిసి సత్కరిస్తున్న ఏడీఏ బాబూరావు

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్, మెడిసిన్ హెచ్‌వోడీగా విధులు నిర్వర్తిస్తూ శుక్రవారం పదవీ విరమణ పొందిన డాక్టర్ హరి విజయకుమార్‌కు ఆసుపత్రి అధికారులు, సిబ్బంది ఘన వీడ్కోలు పలికారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, జీజీహెచ్ జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ ఛాంబర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. జేఏసీ చైర్మన్ పాలపర్తి మూర్తిబాబు, ఏపీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ డాక్టర్ హరి విజయకుమార్‌కు పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ లావణ్యకుమారి, మూర్తిబాబు మాట్లాడుతూ డాక్టర్ విజయకుమార్ అత్యంత నిబద్ధతతో విధులు నిర్వర్తించారని, ఆయన స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఉద్యోగనంతర జీవితం సుఖమయం కావాలని ఆకాంక్షించారు. డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ, గడచిన పాతికేళ్లుగా జీజీహెచ్‌లో ఎందరో రోగులకు వైద్య సేవలందించానని పేర్కొంటూ, తన వృత్తి జీవితంలో అడుగడుగున సహకరించిన అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎస్ ఆర్‌ఎంవో డాక్టర్ అనిత, ఏడీ అనురాధ, ఏవో శేషేంద్ర శర్మ, మేనేజర్ నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఈఓ సేవలు అభినందనీయం

కరప: రైతులకు అందుబాటులో ఉంటూ సాగు మెళకువలు వివరిస్తూ ఏఈఓగా హబ్ మేనేజర్‌గా ఎంవీవీ సత్యనారాయణ అందించిన సేవలు మరువలేనివని కరప సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు అన్నారు. ఏఈఓ, హబ్ మేనేజర్ సత్యనారాయణ పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగస్తులకు పదవీ విరమణ అనేది తప్పదని, అయితే తాము చేసిన సేవలే గుర్తుండిపోతాయన్నారు. ఈ సందర్భంగా కరప సబ్ డివిజన్ పరిధిలోని కరప, కాజులూరు, తాళ్లరేవు మండలాల వీఏఏలు, ఏఈఓల తరఫున ఏఈఓ సత్యనారాయణను ఏడీఏ బాబూరావు ఘనంగా సత్కరించారు. కరప, కాజులూరు ఎంఏఓలు ఏవీ రాజేష్, వి.అశోక్, ఆయా మండలాల ఏఈఓలు, వీఏఏలు పాల్గొన్నారు.

ప్రశాంత జీవనం సాగించాలి



వెంకటరమణ దంపతులను సత్కరిస్తున్న అధికారులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి శుక్రవారం పదవీ విరమణ పొందిన దవులూరి వెంకటరమణ దంపతులను గ్రామస్తులు, అధికారులు, సహచర పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ అనంతరం జీవనం ప్రశాంతంగా సాగించాలని డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ రమేష్‌నాయుడు, తహసీల్దార్ విజయ్ ప్రసాద్ తదితరులు కోరారు.

పటిష్టంగా ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు



ఎన్నికల కౌంటింగ్‌పై అధికారులతో మాట్లాతున్న కలెక్టర్ నివాస్

- జిల్లా అధికారులకు కలెక్టర్ నివాస్ ఆదేశం
- స్ట్రాంగ్ రూమ్‌లు, లెక్కింపు కేంద్రాల వద్ద ఏర్పాట్ల పరిశీలన

కాకినాడ సిటీ: ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ అధికారులను ఆదేశించారు. స్థానిక జేఎన్‌టీయూలో వివిధ నియోజకవర్గాల స్ట్రాంగ్ రూముల, ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఏర్పాట్లను శుక్రవారం రాత్రి ఆయన ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి, వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ కార్పొరేషన్, పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్, డ్వామా, వ్యవసాయ, ఏపీఈపీడీసీఎల్, సమాచార, సర్వే, రోడ్లు భవనాల, పౌరసరఫరాల సంస్థ తదితర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఎన్టీయూ ప్రధాన ద్వారం వద్ద గుర్తింపు కార్డులు తనిఖీ, బస్సుల ద్వారా అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లు లెక్కింపు కేంద్రాలకు తరలింపు, పిఠాపురం, ప్రత్తిపాడు, జగ్గంపేట, కాకినాడ పట్టణం, తుని, కాకినాడ రూరల్ నియోజకవర్గాలకు చెందిన స్ట్రాంగ్ రూముల, కౌంటింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఏర్పాట్లు, భోజన వసతి, మొబైల్ ఫోన్ల కౌంటర్ స్టాల్స్, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి, ఆయా శాఖల అధికారులకు పలు ఆదేశాలు చేశారు. అనంతరం జేఎన్టీయూ వీసీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఏర్పాట్లపై సమీక్షించారు. నాలుగో తేదీ ఉదయం 8 గంటల నుంచి జేఎన్టీయూలో ప్రారంభమయ్యే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఉదయం 7 గంటల లోపు అభ్యర్థులు, ఏజెంట్లు అందరూ కౌంటింగ్ కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు. ఏజెంట్లు తప్పనిసరిగా ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు జారీ చేసిన గుర్తింపు కార్డులు తమ వెంట తీసుకురావాలని, కౌంటింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు అనుమతిలేదని కలెక్టర్ తెలిపారు. ట్రాఫిక్ మళ్లింపులో భాగంగా ఏజెంట్లు, అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా ట్రాఫిక్, పోలీస్ అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. అచ్చంపేట, నాగమల్లితోట, భానుగుడి జంక్షన్ల వద్ద ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ నివాస్ సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పేనాయక్, అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే మంచి గుర్తింపు



కృష్ణకుమారి దంపతులను సత్కరించిన డీఐజీ నాగలక్ష్మి తదితరులు

కాకినాడ లీగల్: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే మంచి గుర్తింపు లభిస్తుందని కాకినాడ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ ఎ.నాగలక్ష్మి పేర్కొన్నారు. మార్కెట్ అండ్ ఆడిట్ సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్-1 వి.కృష్ణకుమారి పదవీ విరమణ సన్మాన సభను స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. డీఐజీ మాట్లాడుతూ కృష్ణకుమారి విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేశారన్నారు. కృష్ణకుమారి దంపతులను విశాఖ పట్నం డీఐజీ జి.బాలకృష్ణ, కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ పి.రామలక్ష్మి పట్నాయక్, కోనసీమ జిల్లా రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, మార్కెట్ అండ్ ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వర్లు తదితరులు సత్కరించారు.

కాయకుండ ఆపలేదు..!

పిఠాపురం: చెట్టుకు కాయలు కాయకుండా కుండ ఆపలేకపోయింది. తాటికల్లు కోసం చెట్టుకు గీత కార్మికులు ఏర్పాటు చేసిన కుండలను చీల్చుకుంటూ మరీ తాటికాయలు బయటకు వచ్చాయి. వివరాల్లోకి వెళితే...కొత్తపల్లిలో ఒక తాటిచెట్టుకు గీత కార్మికుడు కల్లు కుండలను ఏర్పాటు చేశాడు. కొన్ని రోజుల వరకూ కల్లు గీసిన కార్మికుడు ఇక కల్లు రాకపోవడంతో ఆ కుండలను అలా చెట్టుకు వదిలేశాడు. కొన్నిరోజులకు ఆ కుండలను బద్దలు కొట్టుకుని తాటి కాయలు రావడం చూసి ప్రతిఒక్కరూ ఔరా అంటున్నారు. కుండల్లోంచి బయటకు వచ్చిన ముంజెకాయలు చూపరులను అబ్బుర పరుస్తున్నాయి.



కొత్తపల్లి ముత్యాలమ్మ చెరువు గట్టున ఉన్న తాటి చెట్టు. (అంతరచిత్రం) కల్లు కుండల్లోంచి బయటకు వచ్చిన తాటి కాయలు


చెత్తశుద్ధి అంటే ఇదే కదా..

- స్వచ్ఛత పక్వాడాలో పార్కు పరిశుభ్రం
- చెత్తను తొలగించిన పవర్‌గ్రిడ్ సిబ్బంది
- పది ట్రాక్టర్ల వ్యర్థాల తరలింపు



స్వచ్ఛత పక్వాడాలో భాగంగా శ్రమదానంతో చెత్త తొలగిస్తున్న పవర్ గ్రిడ్ సిబ్బంది

కాకినాడ రూరల్: ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కు చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. ఏ చెత్తలో ఏ పాముందో తెలియక స్థానికులు భయపడుతున్నారు. బాధ్యతగా ఉండాల్సి అధికారులు ఉదాసీనంగా ఉండడంతో నగరపాలక సంస్థ సిబ్బంది ఏమీ పట్టనట్టు వదిలేశారు. దీంతో నిరుపయోగంగా మారిన ఆ పార్కును గండేపల్లి మండలం సూరంపాలెం వద్ద గల పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సిబ్బంది పరిశుభ్రం చేసి స్థానికులకు వినియోగంలోకి తీసుకువచ్చారు. మండలంలోని రెండో డివిజన్‌లోని నగరపాలక సంస్థకు చెందిన తోట సుబ్బారావునగర్ పార్కు నిరుపయోగంగా మారింది. పార్కులో వాకింగ్ ట్రాక్ ఉన్నప్పటికీ చెత్తా చెదారం పేరుకుపోవడంతో ప్రజలు రావడం మానేశారు. స్థానికులు అందుబాటులో ఉన్న పార్కులోకి వెళ్లేందుకు భయపడ్డారు. స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా పవర్ గ్రిడ్ డీజీఎం సత్యవర్ధన్ ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం పార్కులోని పిచ్చి మొక్కలు, పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. చుట్టు పక్కల అపార్టుమెంట్ వాసులు కూడా పార్కునే డంపింగ్ యార్డుగా మార్చేయడంతో సుమారు 10 ట్రాక్టర్లు పవర్ గ్రిడ్ సిబ్బంది శ్రమించి శ్రమదానం ద్వారా తొలగించారు. ఈ సందర్భంగా పవర్ గ్రిడ్ డీజీఎం సత్యవర్ధన్ మాట్లాడుతూ పరిశుభ్రత – పచ్చదనం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పార్కును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు నిరుపయోగంగా ఉన్న సుబ్బారావునగర్ పార్కును ఎంపిక చేసుకుని చెత్తను తొలగించామన్నారు. పార్కు శుభ్రం చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. నామమాత్రంగా కాకుండా నిజమైన స్ఫూర్తితో పార్కును శుభ్రం చేయడం అభినందనీయమని ఆల్ ఈజ్ వెల్ వ్యవస్థాపకుడు కిశోర్ పేర్కొన్నారు.



కాకినాడ-2వ డివిజన్‌లో చెత్తాచెదారంతో నిండిన తోట సుబ్బారావునగర్ పార్కు



చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగింపు అనంతరం పరిశుభ్రంగా కనిపిస్తున్న తోట సుబ్బారావునగర్ పార్కు